
ఒంగోలులోని కూరగాయల మార్కెట్‌లో నిలిచిన వర్షం నీరు


భారీగా వర్షం నీరు నిలిచిన భాగ్యనగర్ 4వ లైన్


మద్దిపాడు ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డులో భారీగా నిలిచిన నీరు

- భారీ వర్షాలకు తడిసిముద్దయిన ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాలు
- జిల్లాలోనే అత్యధికంగా ఒంగోలు నగరంలో 75.4 మిల్లీమీటర్ల వర్షం
- ముందు జాగ్రత్త చర్యల్లో నగరపాలక సంస్థ అధికారులు, పాలకులు విఫలం
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజానీకం

జలమయం


భాగ్యనగర్ 4వ లైన్ 3వ అడ్డరోడ్డులో నిలిచిన వర్షం నీరు


బస్టాండ్ వద్ద రోడ్డులో...


భాగ్యనగర్ 4వ లైన్ 4వ అడ్డరోడ్డులో...

ఒంగోలు సబర్బన్: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు ఒంగోలు జలమయమైంది. నగరంలోని లోతట్టు ప్రాంతాలతో పాటు ప్రధాన రోడ్లు సైతం వర్షం నీటితో నిండిపోయాయి. వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలు చేసినప్పటికీ.. నగరంలో వర్షం నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు ప్రవహించేలా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడంలో నగరపాలక సంస్థ అధికారులు, పాలకులు ఘోరంగా విఫలమయ్యారు. శాశ్వత ప్రాతిపదికన కాకపోయినా..తాత్కాలికంగా అయినా ఒంగోలు నగర ప్రజలకు అవస్థలు లేకుండా చూడాలన్న ఆలోచనే వారికి లేకుండా పోవడంపై నగర ప్రజలు అసహ్యించుకుంటున్నారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి నగరంలోని భాగ్యనగర్ నాలుగో లైన్ పూర్తిగా మునిగిపోయింది. వాహనాలు కూడా తిరగలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలోనే అత్యధికంగా 75.4 మిల్లీమీటర్ల వర్షం ఒక్క ఒంగోలు నగరంలోనే కురిసింది. దీంతో బస్టాండ్ సెంటర్‌తో పాటు నగరంలోని పలు ప్రధాన రోడ్లు, కాలనీలు సైతం వర్షం నీటితో నిండిపోయాయి. కొన్నిచోట్ల ఇళ్లలోకి సైతం వర్షం నీరు చేరిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో, అక్కడి ప్రజలు ఏ స్థాయిలో అవస్థపడ్డారో అర్థం చేసుకోవచ్చు. సహాయం కోరే బాధితుల కోసం హెల్ప్ లైన్ నంబర్ – 1800 425 2858ను ఏర్పాటు చేసి చిన్నపాటి మొక్కుబడి చర్యలు చేపట్టి నగరపాలక సంస్థ అధికారులు చేతులు దులుపుకున్నారు.

కొత్తపట్నం మండలంలో వరి రైతుల హర్షం...

కొత్తపట్నం: ఈ వర్షాలు తమకు మేలు చేస్తాయని కొత్తపట్నం మండలంలోని వరి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నారు పోసి వర్షం కోసం ఎదురు చూస్తున్న క్రమంలో ఒక్కసారిగా వర్షం పడటంతో భూమిలో నీరు చేరగా, ఆ నీరు బయటకు పోకుండా నిలబెట్టుకుని దుక్కి దున్నుకుంటున్నారు. ఎద పెట్టిన వరి పైరు ఈ వర్షంతో జీవం పోసుకుంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఇంత కంటే ఎక్కువ వర్షం పడితే మునిగిపోయి నష్టం వస్తుందని కూడా రైతులు చర్చించుకుంటున్నారు.

సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలి : తహసీల్దార్

వర్షాల కారణంగా కొత్తపట్నం మండలంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని తహసీల్దార్ పి.మధుసూదన్‌రావు సూచించారు. సోమవారం సిబ్బందితో కలిసి మండలంలో పర్యటించి ప్రజలతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు.


కొత్తపట్నం : భారీ వర్షానికి వరి చేలో చేరిన నీరు

చిన్నపాటి నదిని తలపించిన చీమకుర్తి–మర్రిచెట్లపాలెం రోడ్డు...

చీమకుర్తి రూరల్: మండలంలో గోతులతో అధ్వానంగా ఉన్న ఒంగోలు–కర్నూలు రోడ్డు వర్షాలకు నీరు నిలిచి మరింత దారుణంగా తయారైంది. చీమకుర్తిలోని తూర్పు బైపాస్ వద్ద నుంచి మర్రిచెట్లపాలెం శివారు మూసి బ్రిడ్జి వరకు పలు చోట్ల చిన్నపాటి నదిని తలపిస్తోంది. ఈ రోడ్డు పట్ల ఏళ్ల తరబడి ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. ముఖ్యంగా బూదవాడ యల్లయ్యనగర్ కంకరమిల్లులు, పెట్రోలు బంకుల వద్ద రహదారి దెబ్బతిని అడుగున్నర లోతు గుంతలు పడి వర్షం నీరు నిలవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు అతికష్టం మీద రాకపోకలు సాగిస్తున్నారు.

మద్దిపాడులో చెరువులా మారిన సర్వీసు రోడ్డు...

మద్దిపాడు: స్థానిక జాతీయ రహదారి ఫ్లైఓవర్‌కు రెండువైపులా నిర్మించిన సర్వీస్ రోడ్లు వర్షం నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. ఎన్‌హెచ్ అధికారులు ఫ్లైఓవర్‌కు రెండు వైపులా డ్రైనేజీలు సక్రమంగా నిర్మించకపోవడంతో ఈ పరిస్థితి దాపురించి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో 13వ తేదీ రాత్రి మొదలైన వర్షం.. 14వ తేదీ సాయంత్రం వరకూ 51 మిల్లీమీటర్లు నమోదైంది.


చీమకుర్తి–మర్రిచెట్లపాలెం రోడ్డుపై అడుగున్నర ఎత్తున నిలిచిన నీరు

మద్యం షాపులు ఖరారు

చీమకుర్తి: చీమకుర్తి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని 16 మద్యం దుకాణాలకు సోమవారం ఒంగోలులో లాటరీ నిర్వహించారు. ఆయా షాపులను దక్కించుకున్న వారి పేర్లను ప్రకటించారు. ఎక్సైజ్ సీఐ సుకన్య తెలిపిన వివరాల ప్రకారం... చీమకుర్తి అర్బన్‌లో 5, చీమకుర్తి రూరల్‌లో 4, మద్దిపాడులో 3, సంతనూతలపాడులో 4 చొప్పున మొత్తం 16 మద్యం దుకాణాలకు టెంపరరీ లైసెన్స్‌లను అందించారు. ఈ నెలాఖరు వరకు టెంపరరీ లైసెన్స్‌లపై నడిపిన తర్వాత వచ్చే నెల నుంచి రెండేళ్ల కాలపరిమితితో పర్మినెంట్ లైసెన్స్‌లు జారీ చేయనున్నారు. మద్యం లైసెన్స్‌లు దక్కించుకున్న వారు లైసెన్స్ ఫీజు రూ.65 లక్షలలో 6వ వంతు రూ.10,83,334ను మొదటి వాయిదా కింద చెల్లించినట్లు సీఐ తెలిపారు. మిగిలిన లైసెన్స్ ఫీజును 5 వాయిదాలలో చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు.

పలు గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు

మద్దిపాడు: మండలంలోని ఏడుగుండ్లపాడు, మద్దిపాడు, వెల్లంపల్లి, దొడ్డవరం, ఇనమనమెళ్లూరు, బసవన్నపాలెం గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలకు సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ సోమవారం శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులు రూ.50 కోట్లను ఖర్చుచేయనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాలలో ఎంపీడీఓ వి.జ్యోతి, ఆయా గ్రామాల సచివాలయాల సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులపై రాజకీయ కక్షలు ఆపాలి

ఒంగోలు సిటీ: జిల్లాలో మున్సిపల్ కార్మికులపై అధికార పార్టీ కక్ష సాధింపు చర్యలు ఆపాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలోని మున్సిపాలిటీల్లో అధికార పార్టీ రాజకీయ రంగు పులిమి కార్మికులను బెదిరిస్తోందన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోగా, ఉద్యోగాలు తొలగించడం, మరికొందరిని తొలగిస్తామంటూ వేధించడం సమంజసం కాదని హితవు పలికారు. మార్కాపురం మున్సిపాలిటీలో నిలిపివేసిన 22 మంది మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జామియా మసీదుకు నూతన కార్యవర్గం ఎన్నిక

ఒంగోలు మెట్రో: నగరంలోని 12వ డివిజన్లో ఉన్న జామియా మసీదుకు నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. వక్ఫ్ జిల్లా అధికారి, ఇన్‌స్పెక్టర్ షేక్ జుబేర్ ప్రభుత్వం తరఫున నూతన కమిటీకి నియామక పత్రాలు అందించారు. నూతన కమిటీ ప్రెసిడెంట్‌గా పఠాన్ నజీర్ అహమ్మద్ ఖాన్, సెక్రటరీగా షేక్ కలామ్, ట్రెజరర్‌గా షేక్ అబ్దుల్ సలామ్, కార్యవర్గ సభ్యులుగా పఠాన్ కరిముల్లా, షేక్ మహబూబ్ జానిని మసీదు పెద్దలు ఎన్నుకున్నారు.